మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు చుక్క రాములు

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు చుక్క రాములు

కంది, జూలై 21: కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతన్నల సందేహాలను నివృత్తి చేయాలని కోరారు. ఆదివారం సంగారెడ్డి కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఏడు మాసాల పాలన పూర్తయినా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప గృహజ్యోతి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. పంట పెట్టుబడి సాయం కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, రైతు భరోసా ఎప్పుడు అమలవుతుందో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ధాన్యం, ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, డీఏలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాల జీవోలను సవరించి కొత్త జీవోలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయరాజు, రాజయ్య, మల్లేశం, మానిక్యం, రాంచందర్, సాయిలు, నర్సింలు, యాదగిరి, ప్రవీణ్, మహిపాల్, విద్యాసాగర్, అశోక్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కోహీర్, జూలై 21: ఉపాధ్యాయుల సమస్యలను తస్వరమే పరిష్కరించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సాబేర్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఎస్టీయూ సంఘం భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీలైన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు నెలల కరువు భత్యం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త పీఆర్సీని వెంటనే అమలు అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యా వ్యవస్థ, విద్యార్థులను కాపాడాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ సంఘం జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు రియాజ్ అహ్మద్‌ఖాన్, సత్తార్, హైదర్‌హై, తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం ప్రారంభం

వినాయక మండపాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జూలై 21: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీసాయి గణేశ్ కాలనీలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ వినాయక మండపాన్ని ప్రారంభించారు. ఆదివారం శ్రీసాయికాలనీలో సొంత నిధులతో వినాయక మండపాన్ని నిర్మించారు. ప్రారంభోత్సవం సందర్భంగా కార్పొరేటర్‌ను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తన దృష్టికి తేవడంతో తక్షణం స్పందించి వినాయక మండపాన్ని నిర్మించి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రామిరెడ్డి, జనరల్ సెక్రటరీ సంతోష్, మాజీ వార్డ్ కమిటీ సభ్యుడు నవీన్‌రెడ్డి, శ్యామ్, సత్యనారాయణ, మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ అజ్మత్ అజ్జు పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం

జిన్నారం, జూలై 21: మండల కేంద్రం జిన్నారంలో నిర్మిస్తున్న శివాలయానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు రాకేశ్ గోయల్, దినేశ్ గోయల్ విరాళం అందించారు. ఆదివారం శివాలయ నిర్మాణాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి శివాలయ నిర్మాణానికి తమ వంతుగా రూ.3లక్షలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టెంపుల్ కమాన్‌ను ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ నందారం నరసింహాగౌడ్

అమీన్‌పూర్ జూలై 21: ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నందారం నరసింహ గౌడ్ అన్నారు. సొంత నిధులతో నిర్మించిన బీరంగూడ పోచమ్మతల్లి టెంపుల్ కమాన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయి మెడోస్ కాలనీవాసుల కోరిక మేరకు పార్కు సైతం ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. 12వ వార్డులో దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

నిధులు లేక నిర్మాణాలకు బ్రేక్!

- పూర్తి కాని పంచాయతీ భవన నిర్మాణాలు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు



రేజింతల్‌లో పిల్లర్ల దశలో నిలిచిన పంచాయతీ కార్యాలయ పనులు

న్యాల్‌కల్, జూలై 21: రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు చేపట్టిన పంచాయతీ భవనాలకు నిధుల గ్రహణం పట్టడంతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలతోపాటు శిథిలావస్థకు చేరిన గ్రామ పంచాయతీ భవనాలకు ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. మండలంలోని రుక్మాపూర్, శంశోల్లాపూర్, రేజింతల్, హద్నూర్ గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాల కోసం రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. దీంతో ఆయా గ్రామాల్లో కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించారు. మండలంలోని ఏరుక్మాపూర్, శంశోల్లాపూర్, రేజింతల్ గ్రామాల్లో పిల్లర్లు వేసి స్లాబ్ వరకు నిర్మాణం చేపట్టారు. హద్నూర్‌లో మాత్రం గుంతల వరకే పనులు పరిమితమయ్యాయి. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో బిల్లుల మంజూరు నిలిచిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బిల్లులు వస్తాయో, రావోనని కాంట్రాక్టర్లు భవనాల నిర్మాణ పనులను నిలిపివేశారు. దీంతో పంచాయతీ భవన నిర్మాణాలు పూర్తికాక ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు వాపోతున్నారు. సంబంధిత జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకొని అర్ధంతరంగా నిలిచిన భవన నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బొల్లారం: బీరప్ప బస్తీలో కూలిన చెట్టును తొలిగిస్తున్న మున్సిపల్ కార్మికులు

సిర్గాపూర్‌లో 47.8 మిల్లీ మీటర్ల వర్షం

సిర్గాపూర్, జూలై 21: మండలంలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా విస్తారంగా వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. 47.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు వచ్చి చేరింది. మండలంలోని కడ్పల్ గ్రామంలోని హైస్కూల్ ప్రహరీలోకి వర్షం నీరు చేరడంతో మడుగులా తయారైంది. రోడ్డుపై వెళ్లే నీరంతా బడిలోకి చేరడంతో చెరువును తలపిస్తున్నది. పాఠశాలలోకి వర్షం నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

వర్షాలకు నేలకొరిగిన చెట్టు

బొల్లారం, జూలై 21: మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెట్లు నేలకొరిగాయి. ఆదివారం 11వ వార్డు బీరప్ప బస్తీలో రోడ్డుకు అడ్డంగా చెట్టు నేల కూలడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికులతో కూలిన చెట్టును తొలిగించారు.

ఘనంగా గురుపౌర్ణమి

ఝరాసంగం, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకొని జిల్లాలోని సాయిబాబా ఆలయాలు ఆదివారం సందడిగా మారాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, సిద్దేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి మాతృశ్రీ అనసూయమాత, అవధూత గిరి మహారాజ్‌లకు నాణేలతో తులాభారం, గురుపాద పూజలను నిర్వహించారు. సిద్దేశ్వరానందగిరి మహారాజ్, రంజోల్ రాజయోగ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్య స్వామి, నందిని గిరి మాత, శివశంకర్ స్వామి పాల్గొన్నారు.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, జూలై 21: మండలంలోని బొంతపల్లి–వీరన్నగూడెంలోని సాయిబాబా మందిరంలో వీరభద్ర, అయ్యప్ప, సాయి సేవా సమితి సభ్యులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, ఆలయ అర్చకులు హరాచారిగిరీశ్ పంతులు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు.

న్యాల్‌కల్‌లో..

న్యాల్‌కల్, జూలై 21: మండలంలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దేవగిరి మహారాజ్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మహారాజ్‌లకు పాదపూజ చేసి దర్శించుకున్నారు. మండలంలోని రాఘవపూర్‌లోని పంచవటి క్షేత్రంలోని సాయిబాబా విగ్రహానికి స్థానిక పీఠాధిపతి కాశీనాథ్ బాబా ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రేజింతల్ సిద్ధి వినాయక ఆలయం, మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని సాయిబాబా ఆశ్రమం, మల్గి గ్రామంలోని షిర్డి సాయిబాబా, నవనాథ్ సిద్ధలింగేశ్వర, రాజోలాలోని వ్యాస మహర్షి ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గురువులకు ఘన సన్మానం

గుమ్మడిదల, జూలై 21: నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నిత్యయోగా సేవాసమితి సభ్యులు సురేందర్, చంద్రశేఖర్, బొంతపల్లి గ్రామానికి చెందిన సరెడ్డిగారి భిక్షపతిరెడ్డి, రాములు, బైరవ గురూజీ వారి గురువులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. పూలదండలు, శాలువాలతో సత్కరించారు. గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు.

కంది: మంజీర నదిలో సరస్వతీ మహాస్నాపన మహోత్సవం



న్యాల్‌కల్: మల్గిలో పూజలు చేస్తున్న భక్తులు



గుమ్మడిదల: బొంతపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గుమ్మడిదల: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా తమ గురువులను సన్మానించిన నిత్యయోగాసేవాసమితి సభ్యులు

నారాయణఖేడ్: సంగ్రామ్ మహరాజ్ ఆశీస్సులు పొందుతున్న నాయకులు



రామచంద్రాపురం: పూజలు చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

భవానీ శంకర ఆలయంలో..

బొల్లారం: హోమం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి దంపతులు

బొల్లారం, జూలై 21: బొల్లారం మున్సిపల్ పరిధిలోని కేబీఆర్ కాలనీలోని భవానీ శంకర సాయి సన్నిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్‌రెడ్డి దంపతులు ప్రత్యేక హోమం, అభిషేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ కోలన్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్: పూజలు చేస్తున్న చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి

అమీన్‌పూర్, జూలై 21: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువు కట్టపై సాయిబాబా ఆలయంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేసి 21 రోజుల సాయిబాబా దీక్షను విరమించారు.

మంజీరాలో ప్రత్యేక పూజలు

కంది, జూలై 21: జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి సమక్షంలో ఫసల్‌వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సర్వతీమాతకు మహాస్నాపనమాచరించారు.

పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్లా

రామచంద్రాపురం, జూలై 21: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. ఆదివారం ఆర్సీపురంలో నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను పూర్తి చేసినందుకు కృతజ్ఞలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో317ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన పోస్టులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం సంఘం వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్‌ని రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవంగా తొలిగించింది. రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి పులి దేవేందర్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గండికి మత్స్యకారుల మరమ్మతులు

ఊట్ల పెద్ద చెరువు అలుగుకు పడిన గండిని పూడ్చేస్తున్న మత్స్యకారులు

జిన్నారం, జూలై 21: మండలంలోని ఊట్ల గ్రామ పెద్దచెరువుకు ఉన్న రెండు అలుగుల్లో మంగంపేట వైపు ఉన్న అలుగుకు గతేడాది పెద్ద గండి పడింది. నీళ్లతోపాటు చేపలు కూడా ఈ గండిలోంచి బయటకు భారీగా వెళ్లాయి. ఈ విషయమై మత్స్యకారులు సంబంధిత అధికారులకు చెప్పినా ఎలాంటి స్పందన రాలేదు. మళ్లీ వర్షాకాలం మొదలవడంతో చెరువులోకి నీళ్లు క్రమంగా చేరుకుంటున్నాయి. చెరువు నిండితే మళ్లీ గత పరిస్థితులే వస్తాయని మత్స్యకారులు ఆదివారం మట్టితో గండిని పూడ్చారు. సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేసి టిప్పర్ల ద్వారా మట్టిని పోసి ఇటాచీ, జేసీబీతో గండిని పూడ్చి బాగు చేయించారు. ఊట్ల మత్స్యశాఖ గ్రామ అధ్యక్షుడు ఎస్.మహేశ్, సత్యనారాయణ, మల్లేశ్, నాగరాజు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఓల్డ్ ఆర్సీపురంలో 28న బోనాలు

రామచంద్రాపురం, జూలై 21: ఆర్సీపురం డివిజన్‌లోని ఓల్డ్ ఆర్సీపురంలో ఈ నెల 28న ఆదివారం అమ్మవారి బోనాల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు తాళ్ల కుమార్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆలయంలో గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి బోనాల తేదీని ఖరారు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్, శ్రీను, నవీన్‌గౌడ్, కిరణ్ గౌడ్, రాములు, రవి, జాని పాల్గొన్నారు.

ఊరూరా ఆషాఢ బోనాలు

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఊరూవాడా బోనాలతో సందడి నెలకొంది. ఆదివారం మహిళలు నెత్తిన బోనాలతో వెళ్లి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి బోనం సమర్పించారు. మొక్కులు చెల్లించుకొని పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. బోనాల సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 21

రాయికోడ్: రాయికోడ్‌లో బోనాల సందడి

గుమ్మడిదల: గుమ్మడిదలలో ఫలహారం బండి

వట్‌పల్లి: బోనాలతో వెళ్తున్న మహిళలు

రామచంద్రాపురం: అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

నారాయణఖేడ్: కట్టమైసమ్మను దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌శెట్కార్

కోహీర్: గడి కాలనీలో..



జిన్నారం: గడ్డపోతారంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఊరడమ్మ బోనాలకు భక్తజనం

న్యాల్‌కల్, జూలై 21: మండలంలోని హద్నూర్ గ్రామంలో ఊరడమ్మ అమ్మవారికి భారీ ఎత్తున్న మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించిన శోభాయాత్రలో మహిళలు బోనాలు, నైవేద్యాలతో ముందు నడవగా, గొల్లబీర్ల డప్పు వాయిద్యాల హోరు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల పండుగ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు రాజ్‌కుమార్, బక్కారెడ్డి, సంగారెడ్డి, నాగన్న, అంజిరెడ్డి, మల్లన్న, మహేశ్, నరేశ్, అంజన్న, జైపాల్‌రెడ్డి, నవీన్‌పటేల్, రాచన్న, పవన్ పటేల్, రాజు, గుండారెడ్డి, నర్సారెడ్డి, మానిక్‌రెడ్డి, గుండన్న, విశ్వనాథం, యాదుల్ పటేల్ ఉన్నారు.

హద్నూర్‌లో ఊరడమ్మకు బోనాలను సమర్పించేందుకు తరలివెళ్తున్న మహిళలు

ప్రయాణం..నరకప్రాయం

- నిలిచిపోయిన మునిపల్లి, బుసారెడ్డిపల్లి రోడ్డు పనులు
- 8 కిలోమీటర్ల మేర కంకర రోడ్డుపై తప్పని తిప్పలు
- మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

అసంపూర్తిగా నిలిచిపోయిన మునిపల్లి–బుసారెడ్డిపల్లి రోడ్డు

మునిపల్లి, జూలై 21: మునిపల్లి గ్రామ శివారు నుంచి బుసారెడ్డిపల్లి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు.బీఆర్ఎస్ హయాంలో అప్పటి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఈ రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేయించారు. ఎమ్మెల్యే క్రాంతికిరణ్ కాంట్రాక్టర్ చేత రోడ్డు పనులు ప్రారంభించి వేగవంతం చేయించారు. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు నిలిచిపోయాయి. మునిపల్లి మండలంలోని అల్లాపూర్–మునిపల్లి క్రాస్ రోడ్డు నుంచి బుసారెడ్డిపల్లి–సింగూరు వరకు రోడ్డు పనులు ప్రారంభించి కంకర పోసి వదిలేశారు. దీంతో కంకర రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. సుమారు 8కిలోమీటర్ల మేర కంకర పోసి వదిలేశారు. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుని వాహనదారులు, ప్రయాణికులు గాయపడుతున్నారు. ఆరు నెలలుగా ఈ రోడ్డుపై ఎంతో మంది ప్రమాదాలకు గురయ్యారు. బుధేరా చౌరస్తా నుంచి వయా మునిపల్లి, బుసారెడ్డిపల్లి, సింగూరు, జోగిపేట, మెదక్, సిద్దిపేట వరకు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. జహీరాబాద్, తాండూర్, వికారాబాద్, కర్ణాటక ప్రాంతాల ప్రజలు మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా మాత దర్శనానికి, మెదక్ పట్టణంలోని చర్చికి ప్రయాణం చేస్తుంటారు. ఇంతటి ముఖ్యమైన రోడ్డు పనులను పూర్తిచేయడంలో కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వాహనదారులు, ప్రయాణికులు విమర్శిస్తున్నారు. అందోల్ ఎమ్మెల్యే,రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఇలాకాలో రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే ఎలా అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ చూపి ఈ రోడ్డు పనులు వేగంగా పూర్తిచేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు పనుల శిలాఫలకం

ఇబ్బందులు పడుతున్నాం

మండల కేంద్రమైన మునిపల్లికి వెళ్లాలంటే గీ రోడ్డుపై పడుతూ.. లేస్తూ వెళ్లాల్సి వస్తున్నది. బుసారెడ్డిపల్లి నుంచి మునిపల్లి వరకు దాదాపు 8 కిలోమీటర్ల దూరం కంకర పోసి వదిలేయడంతో వాహనాలు అదుపుతప్పి కింద పడుతున్నాం. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మునిపల్లి–బుసారెడ్డిపల్లి రోడ్డును తొందరగా బాగు చేయించాలి.

-సురేశ్, బుసారెడ్డిపల్లి